TELANGANA
RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి




EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:24 WEDNESDAY , JUNE 3,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 24 బుధవారం 3 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

# రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

**ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అభివృద్ధి,సంక్షేమం,సామాజిక న్యాయంపై దిశానిర్దేశం**
**తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**



హంస కలం వార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని ప్రపంచానికే గేట్‌వేగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.2023 డిసెంబర్ 7న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ అభివృద్ధి,పేదరిక నిర్మూలన,సామాజిక న్యాయమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి "తెలంగాణ రైజింగ్–2047" దార్శనిక పత్రాన్ని రూపొందించామని, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా,2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 2లో..





## కార్మికుల హక్కుల పరిరక్షణలో ఐఎన్ టియూసీ చిరస్మరణీయ చరిత్ర

**-జలమండలి గుర్తింపు సంఘ ఎన్నికల్లో మొగుళ్ల రాజిరెడ్డి ప్యానెల్‌కు మద్దతుగా ప్రచార సభ**
**-మంత్రి వివేక్ వెంకట స్వామి**

హంసకలం వార్త::తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు సంఘ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్ టీయూసీ తరపున అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న మొగుళ్ల రాజిరెడ్డి ప్యానెల్‌ను ఘన విజయం సాధింపజేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ఎన్నికల 2లో..

## తెలంగాణ అవతరణ దినోత్సవం

# మొత్తం 91 మంది ఖైదీలు విడుదల



**ప్రభుత్వం జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు తీపి కబురు**

హంస కలం వార్త : తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు తీపి కబురు చెప్పింది. సత్ప్రవర్తన కలిగిన 91 మంది ఖైదీలను ముందస్తుగా విడుదల చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఖైదీల విడుదలకు సంబంధించిన అధికారిక 2లో..



## మిలియన్ మార్చ్ ను తలపించేలా

# భూపోరాటం

**పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చిన కవిత**

హంస కలం వార్త : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే భూ పోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు 2లో..

## సంక్షేమం-అభివృద్ధి-సామాజిక న్యాయమే

# ప్రభుత్వ లక్ష్యం



హంస కలం వార్త : సంక్షేమం,అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించిన భట్టి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక,రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి 2లో..


## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? రావొద్దనడానికి మీరెవరు

- తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన
- బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్
- తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి
- అధికారంపై ఆశ లేదు, సమాజంలో మార్పు మాత్రమే లక్ష్యమని ఉద్ఘాటన



హంస కలం వార్త : తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తు న్నారు. తెలంగాణ ఏమైనా వాళ్ల అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు," అని తీవ్ర 2లో..

# మిస్టర్ పవన్ తెలంగాణ మా అయ్య జాగీరే



- తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజలజాగీరే.పవన్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం హెచ్చరిక
- ఆంధ్రాలోనే గెలవలేదు. తెలంగాణకు వచ్చి చేసేదేముంది?
- తెలంగాణ అమరవీరులకు ఎప్పుడైనా పవన్ మద్దతు ఇచ్చారా?
- పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్
- రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పవన్ సభ పెట్టడంపై ఆగ్రహం
- ఆవిర్భావ దినోత్సవాన పవన్ సభకు అనుమతి నిరాకరించిన పోలీసులు
- పవన్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్ అంటూ పొన్నం తీవ్ర విమర్శలు

హంస కలం వార్త : తెలంగాణమీఅయ్యాజాగీరా? అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. మిస్టర్ పవన్ కళ్యాణ్! తెలంగాణ మా అయ్య జాగీరే అంటూ పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల జాగీరే. ఆయన మాటల్లో అహంకారం కనిపించింది. పవన్ పెయిడ్ ఆర్టిస్ట్ అంటూ ధ్వజమెత్తారు. ఆంధ్రాలోనే గెలవలేదు. తెలంగాణకు వచ్చి చేసేదేముంది ఆంధ్రాలోనే గెలవలేదు. తెలంగాణకు వచ్చి చేసేదేముంది అని ఆయనే వ్యాఖ్యానించారు. ఏపీలో తన పరిస్థితి ఏంటో తానే చెప్పుకున్నాడు.ఆంధ్రాలోనే తనకు దిక్కులేదు తెలంగాణలోఏముంటుంది అన్నారు. ఏపీప్రజలు ఇక్కడ ఉండొద్దని ఇక్కడ పెట్టుబడులు పెట్టొద్దని మేము అనట్లేదు. అమెరికా వాళ్లే పెట్టుబడి పెట్టగా ఏపీ వాళ్లు పెడతామంటే మేము ఎందుకు వద్దంటాం. పవన్ తెలంగాణ నీ అయ్యాజాగిరి కాదు పవన్. ఇక్కడకొచ్చి ఏం -2లో..

# తెలంగాణ అవతరణ దినోత్సవం మొత్తం 91 మంది ఖైదీలు విడుదల

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు తీపి కబురు చెప్పింది. సత్ప్రవర్తన కలిగిన 91 మంది ఖైదీలను ముందస్తుగా విడుదల చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఖైదీల విడుదలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులైన జీవో ఎంఎస్ నెం. 54 ను జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులనంతరం ఇవాళ మధ్యాహ్నం చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి 91 మంది ఖైదీలనుఅధికారులు విడుదల చేశారు. కాగా, జైలు నిబంధనలకు లోబడి, శిక్షా కాలంలో ఉత్తమ ప్రవర్తన కనబరిచిన వారికే ఈ ముందస్తు విముక్తి కల్పించారు. ఇవాళ విడుదలైన వారిలో 85 మంది పురుషులు కాగా, ఆరుగురు మహిళా ఖైదీలు ఉన్నారు. తమ వారు ముందస్తుగా విడుదలవుతున్నారనే సమాచారంతో ఖైదీల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున చర్లపల్లి జైలు వద్దకు చేరుకున్నారు. జీవో కాపీలు అందిన తర్వాత జైలు అధికారులు ఒక్కొక్కరిని బయటకు పంపించారు.

## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? రావొద్దనడానికి మీరెవరు

గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన 'వారాహి' వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు. విభజన తీరునే వ్యతిరేకించాను తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. "రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించాను. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టాను. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేను ఎప్పుడూ గౌరవించాను. సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష" అని వివరించారు. ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. "హైదరాబాద్‌లో నేను ఒక చెరువును కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆ భూమిని పరిశీలించండి. నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. నాపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు" అని బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## మిస్టర్ పవన్ తెలంగాణ మా అయ్య జాగీరే!

తెలంగాణ మా అయ్య జాగీరే అంటూ పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల జాగీరే. ఆయన మాటల్లో అహంకారం కనిపించింది. పవన్ పెయిడ్ ఆర్టిస్ట్ అంటూ ధ్వజమెత్తారు. ఆంధ్రాలోనే గెలవలేదు. తెలంగాణకు వచ్చి చేసేదేముంది ఆంధ్రాలోనే గెలవలేదు. తెలంగాణకు వచ్చి చేసేదేముంది అని ఆయనే వ్యాఖ్యానించారు. ఏపీలో తన పరిస్థితి ఏంటో తానే చెప్పుకున్నాడు. ఆంధ్రాలోనే తనకు దిక్కులేదు తెలంగాణలోఏముంటుంది అన్నారు. ఏపీప్రజలు ఇక్కడ ఉండొద్దని ఇక్కడ పెట్టుబడులు పెట్టొద్దని మేము అనట్లేదు. అమెరికా వాళ్లే పెట్టుబడి పెట్టగా ఏపీ వాళ్లు పెడతామంటే మేము ఎందుకు వద్దంటాం. పవన్ తెలంగాణ నీ అయ్యజాగిరి కాదు పవన్. ఇక్కడకొచ్చి ఏం మాట్లాడుతున్నావ్ అని హెచ్చరించారు. గద్దర్‌కు కార్ కొనిచ్చా అని బహిరంగంగా ప్రకటించి పవన్ తప్పు చేశాడు. పవన్ గద్దర్‌కు క్షమాపణ చెప్పాలి లేదంటే దళిత సంఘాలు ప్రశ్నించాలి. తెలంగాణను పదేపదే పాకిస్థాన్‌తో పోల్చి అవమానిస్తున్నారు. తెలంగాణ అమరవీరులకు ఎప్పుడైనాపవన్ మద్దతు ఇచ్చారా?తెలంగాణ ఏర్పాటు తో 11 రోజులు అన్నం తినలేదు అన్నది పవన్ కాదు. పవన్ కళ్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్. రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వకవాతావరణం కోసం మేము ప్రయత్నం చేస్తున్నాం. కొండగట్టుకు పవన్ వస్తే తెలంగాణ ఛీఫ్ గెస్ట్ గా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కొండగట్టుకు పైసలు ఇచ్చా మంటున్నారు. మీ అయ్య జాగిరా?ఆ పైసలు. బీజేపీ పార్టీ పవన్‌కు సరైన స్క్రిప్ట్ ఇవ్వలేదు.తెలంగాణ ఆవిర్భావదినోత్సవం రోజే సభ పెట్టి పవన్ గెలికాడు. తెలంగాణ లొ పవన్ తిరుగుతా అంటే మాకు అభ్యంతరం లేదు అని ?స్పష్టం చేశారు.

## తెలంగాణకు వర్ష సూచన..

తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది.ఎండ తీవ్రతతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.నైరుతి రుతుపవనాల రాకతో పాటు వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గనున్నట్లు ప్రకటించింది.ఆగ్నేయ అరబిక్ మహాసముద్రం,లక్షద్వీప్ దీవులు, కేరళ,తమిళనాడులోని కొన్ని ప్రాంతాలతో పాటు బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి.జూన్ 4వ తేదీ లోగా ఈ రుతుపవనాలు మరింత ముందుకు ప్రవేశించడానికి పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ స్పష్టం చేసింది.మరోవైపు,తూర్పు మధ్యప్రదేశ్ మరియు దానికి సమీపంలోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఉపరితల చక్రవాక ఆవర్తనం కేంద్రీకృతమై ఉంది.ఇది సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది.దీని ప్రభావంతో పాటు..ఛత్తీస్‌గఢ్ నుండి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఈశాన్య తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.

# రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

2023 డిసెంబర్ 7న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ అభివృద్ధి,పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి "తెలంగాణ రైజింగ్-2047" దార్శనిక పత్రాన్ని రూపొందించామని, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా,2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవల కేంద్రంగా అభివృద్ధి చేస్తూనే, గ్రామీణ తెలంగాణను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో బలోపేతం చేస్తున్నామని చెప్పారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు.గత రెండున్న రేళ్లలో వ్యవసాయం,రైతు సంక్షేమం కోసం రూ. 1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని వెల్లడించారు.పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం చేపట్టిన కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని తెలిపారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు విజయ వంతంగా అమలవు తున్నాయని చెప్పారు. యువతకు ఇచ్చిన హామీ మేరకు పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టి 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ప్రీ-ప్రైమరీ తరగతుల విస్తరణ, విద్యార్థులకు అల్పాహార పథకం అమలు వంటి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఇప్పటికే లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తైందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి కోట్లాది మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా కేశవరావు, కోదండరాం నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశామని సీఎం వెల్లడించారు. కమిటీ నివేదిక ఆధారంగా ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక,విద్యా,ఉపాధి,రాజకీయ కులగణన సర్వే నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు.గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చామని,ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం మెట్రో విస్తరణ,మూసీ ప్రక్షాళన,ఫ్యూచర్ సిటీ నిర్మాణం,చెరువుల పరిరక్షణ, ఈవీ ప్రోత్సాహకాలు వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం, ఆశీర్వాదం అవసరమని కోరుతూ, అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.జై తెలంగాణ..జై హింద్ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణలో ఐఎన్ టియూసీ చిరస్మరణీయ చరిత్ర

మంగళవారం హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యేలు దానం నాగేందర్,అనిల్ కుమార్ యాదవ్, కాలే యాదయ్య, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,ఐఎన్ టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, కార్మిక నాయకులు, జలమండలి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ...తన తండ్రి కాకా వెంకట స్వామి ఐఎన్ టీ యూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి కలిసి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 1947లో స్థాపించబడిన ఐఎన్ టీ యూసీ అప్పటి నుంచి నేటి వరకు కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.జలమండలి ఉద్యోగుల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే ఈ ఎన్నికల్లో ఐ ఎన్ టీ యు సీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని,కార్మికుల సమస్యలను గుండెల్లో పెట్టుకుని పరిష్కరిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ సమ్మె సందర్భంగా 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మెను రెండు రోజుల్లోనే చర్చల ద్వారా పరిష్కరించి కార్మికుల సమస్యలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘ ఎన్నికలను బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాలను పెంచిందని తెలిపారు. గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు దేశంలోనే ఆదర్శంగా నిలిచే విధంగా గిగ్ వర్కర్స్ చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు.గిగ్ వర్కర్స్ చట్టం అమలు, కనీస వేతనాల పెంపు వంటి నిర్ణయాలతో కార్మికుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగింద న్నారు. జలమండలి ఎన్నికల్లో మొగుళ్ల రాజిరెడ్డి విజయం సాధించిన వెంటనే యాజమాన్యంతో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ నెల 6న జరగనున్న జలమండలి గుర్తింపు సంఘ ఎన్నికల్లో సుమారు 3 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగిం చుకోనున్న నేపథ్యంలో,ఐ ఎన్ టీయూసీ, ఏఐటీయూసీ, జలమండలి ఎస్సీ-ఎస్టీ కార్మిక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న మొగుళ్ల రాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి వివేక్ వెంకట స్వామి కోరారు.

# మిలియన్ మార్చ్ ను తలపించేలా భూపోరాటం

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే భూ పోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం 12 ఏళ్లైనా హైదరాబాద్ లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆగస్ట్ 6 లోపు జయశంకర్ సార్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కవిత అల్టిమేటం జారీ చేశారు.

### మిలియన్ మార్చ్ తరహా భూపోరాటం

ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తారని భావించినప్పటికీ మళ్లీ మోసం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అ అంశాలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేకే కమిటీ విధివిధానాలను కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జులై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా అతి పెద్ద 'భూపోరాటం' చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని, ఇది తెలంగాణ అస్తిత్వం, ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు.ఈ మహా సంగ్రామానికి రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా మిత్రులతో పాటు ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకొని తరలిరావాలని కోరారు. 'మిలియన్ మార్చ్' ను గుర్తు చేసే విధంగా ఈ భూపోరాట ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు.

### ఆగస్ట్ 6 లోగా జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలి

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత అన్యాయమైన విషయమని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసి, మలిదశ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను గౌరవించు కోవాల్సిన బాధ్యత మనందరిదీ అని అన్నారు. తెలంగాణ జాగృతి తరపున ఇప్పటికే నాలుగు జిల్లాల్లో జయశంకర్ సార్ విగ్రహాలను ఏర్పాటు చేశామని కవిత గుర్తు చేశారు. అయితే రాష్ట్ర రాజధానిలో ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటు కోసం తెలంగాణ జాగృతి సంస్థ 2014 నుంచే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. 2017 లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేన్న రేళ్లు గడుస్తున్న విగ్రహం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రొఫెసర్ జయశం కర్ సార్ జయంతి అయిన ఆగస్ట్ 6 లోపు ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశామని కవిత చెప్పారు. తమకు అవకాశం ఇస్తే ఆ విగ్రహ ఏర్పాటుతో పాటు లైఫ్ టైమ్ మెయింటెనెన్స్ ను కూడా తామే చేపడతమన్నారు. తమకన్నా గొప్పగా ప్రభుత్వమే స్వయంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కానీ ఆగస్ట్ 6 లోపు హైదరాబాద్‌లో విగ్రహా న్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంక్షేమం-అభివృద్ధి-సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించిన భట్టి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక,రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు,2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే లక్ష్యమన్నారు.రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 59,448 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి,2,01,163 మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఖమ్మం జిల్లా మహిళలు రూ. 303.55 కోట్లు ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాకు 16,243 ఇళ్లు మంజూరు కాగా,రూ. 441 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని,8,291 గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా 2,50,204 కుటుంబాలకు రూ. 236.60 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.మహిళా సాధికారతలో భాగంగా జిల్లాలో 458 స్వశక్తి భవనాల నిర్మాణం కొనసాగుతోందని,మహిళా సంఘాలకు వడ్డీ రాయితీలు,ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కింద జిల్లాలో 3.43 లక్షల మంది రైతులకు రూ. 270.93 కోట్లు జమ చేశామని, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు భారీ స్థాయిలో నిర్వహించామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో విద్యుత్, సాగునీరు, విద్య, వైద్యం, తాగునీరు, గ్రామీణాభివృద్ధి, రహదారులు, ఉపాధి, క్రీడలు, పర్యాటక రంగాల్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. టీజీ ఐపాస్ ద్వారా రూ. 436 కోట్ల పెట్టుబడులతో 200 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చి 1,391 మందికి ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఖమ్మం ఖిల్లా వద్ద రూ. 29 కోట్లతో రోప్‌వే, అమృత్ 2.0 పథకం కింద రూ. 250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా రహదారులు, వంతెనలు, సాగునీటి ప్రాజెక్టులు, మార్కెట్ యార్డులు, విద్యా,వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించి, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు,ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించి అధికారులను అభినందించారు.


# సంపాదకీయం


## తెలంగాణ ఉద్యమ ఆశయాలు నెరవేరాయా

తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాకుండా ఆంధ్ర, తెలంగాణను కలిపి ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేసి ఆంధ్ర రాజకీయ నాయకులు తెలివిగా తెలంగాణ భూములను, ఆర్థిక వనరులను, నీళ్లను, నిధులను, ఉద్యోగాలను దోచుకోవడం మొదలుపెట్టారు. అది ఎంతలా అంటే యావత్ తెలంగాణనే శాసించేలా. దీంతో తెలంగాణలో పనిలేక ప్రజలు, భూములు లేక రైతులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇలా యావత్ తెలంగాణ నిత్యం ఆకలితో, ఆత్మహత్యలతో అల్లాడుతూ ఉన్న భూమిని అమ్ముకొని, వలసలు పోయి కూలి పని చేసుకునే స్థితికి తీసుకొచ్చారు. పైగా తెలంగాణలో అన్ని ఉద్యోగాలలో ఆంధ్రావాళ్లే తిష్ఠ వేసి పెత్తనం చెలాయిస్తుంటే, తెలంగాణలో చదువుకున్న యువత నిరుద్యోగులుగా మారుతున్న తీరును చూసి తట్టుకోలేక "మా ఉద్యోగాలు మాకే కావాలంటూ" నిరుద్యోగులతో మొదలైన 'ముల్కీ ఉద్యమం' నుంచి 1969 తొలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చి, 369 మంది అమరులయ్యారు. ఆ ఉద్యమరూపం ఎటు దారితీస్తుందోననే భయం ఒక్కసారిగా ఆంధ్ర పెత్తందారి పాలకులలో మొదలయ్యింది. దాంతో తెలంగాణ నాయకులకు పదవులను, డబ్బులను ఆశ చూపి, ఆ ఉద్యమాన్ని కుట్రలతో కూడుకున్న ఒప్పందాలతో ఆంధ్ర పాలకులు బలితీసుకున్నారు. తొలి దశ ఉద్యమ లోపాలను సవరించుకుంటూ 'నీళ్లు, నిధులు, నియమాకాల' కోసం మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. అన్ని రంగాల ప్రజలకు చేరువవుతూ అందరి సంపూర్ణ మద్దతుతో బలమైన సైద్ధాంతిక పునాదులతో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఉద్యమ దశ--దిశను నిర్దేశించారు. ఆ ఉద్యమం ప్రజల నుంచి స్వచ్ఛందంగా రావడంతో ఆంధ్ర పాలకుల రాజకీయ ఎత్తుగడలు, కుట్రలు, కుతంత్రాలు, డబ్బు, పదవులు, బలం, బలగం ఏవీ పనిచేయలేదు. ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, తెలంగాణ యూనివర్సిటీలు ఉద్యమాలకు అడ్డాగా మారి మొత్తం తెలంగాణ ప్రజలకు అన్ని యూనివర్సిటీల విద్యార్థి ఉద్యమకారులు అండగా నిలబడ్డారు. ఈ పోరాటంలో దాదాపు 1,200 మందికి పైగా విద్యార్థులు అమరులైనా చెక్కుచెదరని ధైర్యంతో తెలంగాణ సాధించే వరకు విద్యార్థి లోకం పోరాడుతూనే ఉంది. అనేక మంది కళాకారులను ఐక్యం చేస్తూ గద్దర్ సాగించిన సాంస్కృతిక ఉద్యమం యావత్ తెలంగాణ బిడ్డలను కదిలించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు తన ఆటపాటలతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ పాడిన పాటలు ప్రజల గుండెలను రగిలించాయి. రాస్తారోకో, వంటావార్పు, రైల్ రోకో, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన విద్యార్థుల సింహగర్జన సభలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో నిలిచిపోయే ప్రధాన ఘట్టాలు. ఈ ఉద్యమంలో తమవంతు పాత్ర నిర్వహించాలని రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, లాయర్లు, డాక్టర్లు, పోలీసులు సైతం తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. అనేక కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు ఎవరికి వారే స్వతంత్ర జేఏసీలుగా ఏర్పాటు చేసుకొని సొంత డబ్బులతో ఉద్యమాన్ని నడిపించారు. నడక నేర్చిన పిల్లగాండ్ల నుంచి పండు ముసలి వరకు తెలంగాణ ఉద్యమాన్ని తమ భుజస్కందాలపై మోస్తూ ఆంధ్ర పాలకుల నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ కోసం అనేకమంది విద్యార్థులు అమరులుగా మారడాన్ని చూసి, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, అప్పటి యూపీఏ ప్రభుత్వం చలించి పార్లమెంటును దిగ్బంధం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లును ఆమోదించారు. దీంతో 2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ ఉద్యమాన్ని ప్రతిసారి సజీవంగా నిలబెడుతూ విజయతీరాలకు చేర్చడంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల పాత్ర ప్రముఖమైనది. ఈ శతాబ్దపు అతిపెద్ద ఉద్యమంగా తెలంగాణ ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అలాంటి అమరవీరుల చరిత్రను ముందు తరాలకు చెప్పడం బుద్ధిజీవులుగా మన బాధ్యత. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎప్పటికీ అన్యాయాన్ని, దోపిడీని, అణిచివేతలను, నిరంకుశత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉండాలి. తెలంగాణ చరిత్రను, అస్తిత్వాన్ని ఎవరెంత కించపరచినా, హేళన చేసినా అది చెరిగిపోయేది కాదు. తెలంగాణ ఏర్పడి పన్నెండు సంవత్సరాలు గడుస్తున్నా 'నీళ్లు, నిధులు, నియమాకాల' విషయంలో ఇంకా వెనుకబడే ఉన్నాం. వాటిని సాధించుకోవడంలో ఆనాటి పోరాట స్ఫూర్తి పాలకులలో, నాయకులలో లేదు. దాన్ని ప్రశ్నించే ఉద్యమ గొంతులు కూడా ఎందుకో తడబడుతున్నాయి. నిరుద్యోగులు, రైతులు, ఉద్యమకారులు, విద్యార్థులు ఇంకా నిరాశతోనే ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దీన్ని పాలకులు గమనించి భవిష్యత్తులో రాబోయే పెను ఉద్యమాల ప్రమాదాన్ని నివారించి 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఆశయాలను' నెరవేర్చాల్సిన అవసరం ఉంది.

# వలసలకు మతం ఎక్కడిది

ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఇప్పుడు ఒక నినాదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రధానపార్టీల్లో కొన్ని ఆ నినాదం చుట్టూనే రాజకీయాలను నడుపుతున్నాయి. ప్రజల్లో ఉద్వేగాలనూ శత్రుత్వ భావనలనూ రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జనాకర్షక నాయకులందరూ ఆ నినాదమంత్రాన్నే జపించారు. అధికార పీఠాన్ని అందుకోటానికి తహతహలాడుతున్న నేతలూ అదే అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమికొడతామన్నదే ఆ నినాదం. వ్యక్తీకరణలో ఎన్ని తేడాలైనా ఉండొచ్చు.. కానీ సారాంశంలో మాత్రం వలసదారుల లక్ష్యంగానే రాజకీయ ప్రచారం ఊపందుకుంటోంది. దీనికి ఏ ప్రజాస్వామ్యదేశమూ మినహాయింపు కాదు. అన్ని ప్రజాస్వామ్యదేశాలకూ బయట నుంచి వచ్చే వలసల సమస్య తీవ్రమవుతూ ఉంది. దీన్ని కాదనలేం. ఉద్యోగాలు, ఉపాధికోసం వచ్చే సక్రమ వలసలను బాగా తగ్గించాలనే డిమాండు ఒకవైపు ఉంటే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలనే లక్ష్యం కొన్నిచోట్ల విపరీత పోకడలు పోతోంది. అమానవీయంగా తయారవుతోంది. ఇటీవల జరిగిన బెంగాల్, అసాం అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమ వలసల సమస్యే బీజేపీకీ ప్రధాన ప్రచార ఆయుధంగా మారింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తోన్న ముస్లింలతో బెంగాల్, అసాంల్లో జనాభా ముఖచిత్రం మారిపోతోందన్న ప్రచారానికే అది పరిమితం అవ్వలేదు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోకీ అక్రమ వలసదారులు చొచ్చుకుపోతున్నారనీ అనేకచోట్ల స్థానికుల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారనీ ఆరోపించింది. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోందనీ సాక్షాత్తూ కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోటానికి మే 26న ఒక ఉన్నత స్థాయి కమిటీని (హైలెవల్ కమిటీ ఆన్ డెమొగ్రాఫిక్ చేంజ్) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక సంవత్సరంలోపు నివేదికను ఇవ్వాలని ఆ కమిటీకి నిర్దేశించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రకాశ్ ప్రభాకర్ నావ్లేకర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఆ కమిటీలో మరో నలుగురు సభ్యులు ఉన్నారు. అందులో భారత జనగణన కమిషనర్ కూడా ఒకరు. విచిత్రం ఏమిటంటే కమిటీ చైర్మన్‌కు జనాభాలో వచ్చే అనేక రకాల మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసే డెమొగ్రఫీ వ్యవహారంతో అంతకుముందు పెద్దగా పరిచయం లేదు. మధ్యప్రదేశ్‌లో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న తనను ఉన్నతస్థాయి కమిటీకి చైర్మన్‌గా ప్రకటించటం ఆశ్చర్యం కలిగించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు 'ద హిందూ' పత్రిక పేర్కొంది. కమిటీలో ఉన్న మిగతా ముగ్గురు కూడా (జనగణన కమిషనర్ మినహా) జనాభా అధ్యయన శాస్త్రంలో జాతీయస్థాయిలోనూ అంత పేరు ప్రఖ్యాతులు ఉన్నవారేమీ కాదు. పొట్టచేతపట్టుకుని సరిహద్దులను దాటుకుని వచ్చి కూలీనాలీ చేసుకోవటం ఈనాటి సమస్య కాదు. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ ఉంది. ఉమ్మడి బెంగాల్ రాష్ట్రం నుంచి అసాంలోకి ముస్లింల వలసలను బ్రిటిష్ పాలకులు బాగా ప్రోత్సహించారు. అంతకుముందు అసాం రాజులూ ఆ పనిని చేశారు. ఇక స్వాతంత్ర్యానంతరం తూర్పుబెంగాల్‌లో ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తం అయినప్పుడల్లా ఉపాధికోసం భారత భూభాగంలోకి ప్రజలు వలసలు రావటం సర్వసాధారణంగా మారింది. ఆ వలసలు బంగ్లాదేశ్ యుద్ధమప్పుడు ఇంకా ఉధృతం అయ్యాయి. ఆ తర్వాతా కొనసాగాయి. వలసలూ ఇతర కారణాలతో క్రమేపీ ముస్లిం జనాభా పెరగటం అసాం మధ్యతరగతిలో తీవ్ర అభద్రతా భావాన్ని సృష్టించింది. అసాం విద్యార్థుల సంఘం నేతృత్వంలో బెంగాలీయులకు వ్యతిరేకంగా అక్కడ ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమం ఎన్నో ఆటుపోట్లకు లోనైనా చివరకు వలసప్రజల విషయంలో ఒక ఒప్పందానికి దారితీసింది. 1985 ఆగస్టు 15న కుదిరిన ఆ ఒప్పందం ప్రకారం... 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలోకి ప్రవేశించిన వారందరినీ అక్రమ వలసదారులుగా ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి వాళ్ల పేర్లను తొలగించాలి. ఒప్పందం కుదిరి 40 ఏళ్లు గడిచిపోయింది. ఇప్పటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి నాటికి అసాంలో అర్హులైన పౌరులనూ వారి వారసులనూ గుర్తించి నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) నవీకరించటం 2019లోనే పూర్తయినా దాన్ని ఇంకా నోటిఫై చేయలేదు. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ట్రైబ్యునళ్లు, కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. అక్రమ వలసదారులందరూ ముస్లింలేనని విపరీతంగా ప్రచారం జరిగినా ఎన్ఆర్‌సీ కసరత్తులో అది నిజం కాదని తేలింది. ఎన్ఆర్‌సీలో చోటుదక్కని ప్రజల సంఖ్య 19.06 లక్షలని నిర్ధారించారు. దాని ప్రకారం అక్రమ వలసదారులు అసాంలో అంతమంది మాత్రమే ఉన్నట్లు లెక్క. మిగతా 3.11 కోట్ల మంది అసాం



స్థానికులే. 1,600 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేసిన కసరత్తులో తేలిన నిజం అదే. అక్రమ వలసదారుల్లో ఏ మతం వారు ఎంతమంది ఉన్నారో ఎన్ఆర్‌సీ తుదిజాబితాలో అధికారికంగా పేర్కొనలేదు. అనధికారిక అంచనాల ప్రకారం హిందువులే ఆ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి హిందువులు వలసలు రావటం ఎప్పుడూ ఉంది. అన్ని పత్రాలూ పుచ్చుకుని వలసలు వచ్చే పరిస్థితి భారత ఉపఖండంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా లేదు. అక్రమ వలసదారుల్లో హిందువులు ఎక్కువగా ఉండటానికి ప్రధానకారణం బంగ్లాదేశ్‌లో వారి సంఖ్య గతంలోనూ ఇప్పటికీ అధికంగానే ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 1.3 కోట్ల మంది హిందువులు బంగ్లాదేశ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్ జనాభాలో హిందువుల శాతంలో తగ్గుదల ఉన్నా సంఖ్యాపరంగా చూస్తే పెరుగుదలే కనిపిస్తుంది. 1951లో 92 లక్షల హిందూ జనాభా ఉంటే, ఇప్పుడది 1.3 కోట్లు అయింది. అసాం ఒప్పందం ప్రకారం అక్రమ వలసదారులను మతపరంగా విభజించి చూడటానికి వీల్లేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలో కాలుపెట్టిన వాళ్లందరినీ అక్రమ వలసదారులుగానే భావించాలి. హిందువులకూ ముస్లింలకూ ఇదే సూత్రాన్ని వర్తింపచేయాలి. ఎన్ఆర్‌సీ ప్రకారం అక్రమ వలసదారుల్లో హిందువులు అధికంగా ఉన్నట్లు స్పష్టంగా తేలటంతో కేంద్ర ప్రభుత్వం అసాం ఒప్పందానికి విరుద్ధంగా అడుగులు వేసింది. ముస్లింలను పక్కనబెట్టి హిందువులకూ మరో అయిదు మతవర్గాల వారికి మాత్రమే పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ చట్టానికి సవరణను తీసుకువచ్చింది. ముస్లింలు తరలిపోటానికి చాలా దేశాలు ఉన్నాయనీ హిందువులకు అట్లాంటి అవకాశం లేదనీ వారికి ఉన్నదల్లా ఒక్క భారతేనన్న విచిత్ర వాదనతో చట్ట సవరణను సమర్థించుకుంది. ఒక్క ఇజ్రాయెల్ తప్ప ఏ దేశమూ మతం ఆధారంగా ఇతర దేశాల వారికి పౌరసత్వాన్ని కట్టబెట్టటానికి ఎప్పుడూ పూనుకోలేదు. ఇక భారత రాజ్యాంగ చరిత్రలో గతంలో ఎప్పుడూ మతపరమైన భేదభావాన్ని చూపిస్తూ చట్టానికి సవరణను తీసుకురావటమూ జరగలేదు. పౌరసత్వ చట్ట సవరణతో మరో కీలక మార్పునకూ కేంద్రం శ్రీకారం చుట్టింది. అసాం ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత వలసలు వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వకూడదు. పౌరసత్వ చట్టానికి తీసుకువచ్చిన సవరణ ప్రకారం, 2014 డిసెంబర్ 31 నాటికి దేశంలో అడుగుపెట్టిన హిందువులకూ ముస్లింయేతర ఇతర వర్గాలకూ దాన్ని ఇవ్వొచ్చు. అక్రమంగా వలస వచ్చిన హిందువులందరికీ పౌరసత్వం కల్పించి ముస్లింలందరినీ బంగ్లాదేశ్ పంపించటం సాధ్యం అవుతుందా? అన్నదానికి ప్రభుత్వం దగ్గర జవాబులేదు. అసాం తరహాలోనే పశ్చిమబెంగాల్‌లో కూడా ఎన్ఆర్‌సీ కసరత్తుని ఆరంభించి పూర్తిచేస్తే అక్కడా పరిస్థితిలో మార్పు కనపడకపోవచ్చు. సరైన పత్రాల్లేని హిందువులు బెంగాల్‌లో కూడా పెద్దసంఖ్యలోనే తేలే అవకాశం ఉంది. గట్టిగా ప్రయత్నిస్తే వేలల్లో అక్రమ వలసదారులను బయటికి పంపొచ్చు. లక్షల మందిని అట్లా పంపటం సాధ్యం కాదు. భారత్‌లోని అక్రమ వలసదారులందరూ తమ దేశం నుంచి వెళ్లిన వారేనని బంగ్లాదేశ్ అంగీకరించటానికి సిద్ధంగా ఉంటేనే సమస్య పరిష్కారం అవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది అసాధ్యం. అసాం, బెంగాల్లో అక్రమ వలసల వల్ల ముస్లింల జనాభా పెరిగి ఉండొచ్చు. దానికంటే కీలకమైంది.. ముస్లింల్లో సంతానసాఫల్యత రేటు ఎక్కువగా ఉండటం. ముస్లింల జనాభా గణనీయంగా పెరగటానికి అదే ప్రధాన కారణం. విద్యావ్యాప్తి పెరుగుతున్న కొద్దీ, ఆరోగ్యచైతన్యం విస్తరిస్తున్న కొద్దీ అది అన్ని మతాల్లోనూ తగ్గుతోంది. 2000 సంవత్సరం నుంచి ముస్లింల్లో సంతానసాఫల్యతా రేటు గణనీయంగా తగ్గుతోంది. 1992--93 నాటికి అది 4.4 (ఒక మహిళ సగటున కనే పిల్లల సంఖ్య) ఉంటే 2021 నాటికి 2.36కి తగ్గింది. హిందువుల్లో అది 3.3 నుంచి 1.94కి తగ్గింది. తాజా కుటుంబ ఆరోగ్యసర్వేలో వివరాలు సమగ్రంగా వెల్లడైతే ముస్లింల సంతాన సాఫల్యతా రేటు తగ్గుదల ఇంకా స్పష్టంగా కనపడే అవకాశం ఉంది. నిజానికి భారత జనాభాతో పోల్చితే అక్రమ వలసదారుల సమస్య అంత తీవ్రమైంది కాదు. ఎక్కువలో ఎక్కువగా అరశాతానికి మించరు. వాళ్లందరూ శ్రమజీవులే. ఇక్కడి ఆర్థిక వ్యవస్థ ప్రగతికి తోడ్పడుతున్నవారే. చౌకగా శ్రమను అందిస్తున్నవారే. అక్రమ వలసజీవుల సమస్యను ఒక మతంతో ముడిపెట్టి ఆ మతానికి చెందిన వారందరినీ అభద్రతా భావంలోకి నెట్టివేయటమే అసలు ప్రమాదంగా మారుతోంది. దేశంలోని అన్ని సమస్యలకు మైనారిటీలను వేలెత్తి చూపటం వల్ల ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. కశ్మీర్‌లో పరిస్థితులూ, పశ్చిమాసియాలో పరిస్థితులూ ఎన్ని భావోద్వేగాలు కలిగించినా భారత్‌లోని మెజారిటీ ముస్లింలు వాటికి తీవ్రంగా ప్రభావితం కాలేదు. తీవ్రవాద చర్యల్లో పాల్గొన్న వారి సంఖ్య చాలా స్వల్పం. ఈ విషయాన్ని విస్మరించి వాళ్లని అనుమానంతో చూసి, వాళ్లకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా చేసి, ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన చోటు లేకుండా చేస్తే సమస్యలను కొనితెచ్చుకోవటమే అవుతుంది. జనాభాలో ఏ మతం వాళ్లు ఎంత మంది ఉన్నారన్న దానికంటే ఎలాంటి మత సంకుచిత భావాలతో ఎంతమంది ఉన్నారన్నదే ప్రధానం. ముస్లింలను ఓటు బ్యాంకులుగా చూడటాన్ని విమర్శించిన వాళ్లు హిందువులను కనీవినీ ఎరగని రీతిలో మతప్రాతిపదికగా ఓటు బ్యాంకులుగా మార్చుకోవటం అంతకంటే అనర్థాన్ని తెచ్చిపెడుతుంది. రాజకీయాల్లో మత ప్రభావం పెరిగిన చోట ప్రజాస్వామ్యం క్షీణించటమే గానీ ఎదగటం ఎక్కడా జరగలేదు. మంచికీ చెడుకీ మతపరమైన ముద్రలు వేసేచోట లౌకిక దృష్టితో, హేతుబుద్ధితో చర్చలు తగ్గిపోతాయి. కొత్త ఆలోచనలు అడుగంటిపోతాయి. అవి లేని చోట మనవని చెప్పుకొనే నవీన ఆవిష్కరణలూ ఉండవు. సాంకేతిక ప్రగతీ కనపడదు. అనుకరణలే మిగులుతాయి. దేశ జనాభాలో ముస్లింల శాతం పెరగకూడదని భావిస్తే ముందు వాళ్లను అభివృద్ధిపథంలో నడిపించటానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అది చేయకుండా ఎన్ని కమిటీలు వేసినా ప్రయోజనం ఉండదు. అక్రమ వలసలను ఆపటం అమెరికాకే సాధ్యం కావటం లేదు. ఇప్పటికీ అక్కడ 1.4 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నారు. ఆ సంఖ్యతో పోల్చితే మనది చాలా తక్కువ. అమెరికాలో అక్రమంగా ప్రవేశించిన వాళ్లది ఫలానా దేశమని గుర్తించటానికి ఏదో ఒక పత్రం దొరుకుతుంది. అలాంటివి ఉండబట్టే 7 లక్షల మంది భారతీయులను అక్రమ వలసదారులుగా గుర్తించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన బడుగుజీవులకు అట్లాంటి పత్రాలు ఉండటం చాలా అరుదు.

# కన్నెపల్లి మండల కేంద్రంలో “క “న్నీటి” కష్టాలు



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుండి సమస్య లు పెరిగి పోయాయి అని సమస్య లు చెప్పిన పట్టించుకోవడం లేదనీ మాజీ mptc మంగయ్య ధ్వజమెత్తారు. సమస్యలు పట్టించుకో క పోతే రేపటి రోజుల్లో కలెక్టర్ ఆఫీసు వరకు వెళ్తాశీ అని స్థానిక ప్రజా ప్రతినిధుల ను హెచ్చరించారు.



వందరోజుల పనులు వదిలేసి మంచి నీటి కోసం ఇంటి దగ్గర ఉంటున్నా ము. ఓటు వేసే వరకు మమ్మల్ని వాడుకొ ని తర్వాత మా వైపే చూడడం లేదని సమస్యలు చెప్పినా కూడా పట్టించుకోవడంలేదు. డ్రైనేజీ పూడికలు తీయడం లేదు తీయమని అడిగితే ఇదొకటే కాలనీ లేదు మేము తరవాత తిస్తామని అని మాట్లాడుతున్నారు. డ్రైనేజ్ పుడకలు తీసి మాకు నీటి ట్యాంకర్ నిర్మించాలని కోరుతున్నాము.



నీటి బోరింగ్ దగ్గర మురుగునీరు ఆగడంతో దోమల పెరిగిపోయి విష జరాల వస్తున్నాయి. విష జ్వరాలు ఒక కుటుంబం చనిపోయారు. గతంలో డ్రైనేజీ నిర్మిస్తామని ఇంకుడు గుంతలు నిర్మిస్తామని హామీ ఇచ్చి మరిచారు. రేపటి రోజున ఈ సమస్య పునరావృతం కాకముందే డ్రైనేజీ ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులని కోరుతున్నాం.



ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కూడా అవకతవకలు జరిగాయి వంద నుంచి 150 ఇండ్లు ఉన్న మాకు కనీసం రెండిల్లు కేటాయించడంపై మాకు అను మానాలు వ్యక్తం అవుతున్నాయి. మా ఇంట్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు పట్టించుకుంట అని చెప్పి ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

జూన్ - 2- హంస కలంవార్త

మంచిర్యాల బెల్లంపల్లి నియోజకవర్గంలో ని కన్నె పల్లి మండలం కేంద్రం ఎస్టీ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య -- రోడ్డెక్కిన ప్రజలు కన్నెపల్లి మండల కేంద్రంలో రోజురోజుకు ప్రజా సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని ప్రజలు తెలిపారు. నీరు అందక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాగునీటి కోసం రోజంతా ఎదురు చూడాల్సి వస్తోందని, వంద రోజుల ఉపాధి పనులకు కూడా వెళ్లలేకపోతున్నామని మహిళలు వాపోయారు. బోరు నీరు తాగడానికి పనికిరాక ఇతర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాలనీలో పైపులైన్‌లు ఉన్నప్పటికీ, తమకు కేటాయించిన లైన్లకు ఇతరులు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చి నీటిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కొన్ని చోట్ల మోటర్లు బిగించి నీటిని పూర్తిగా తీసుకుంటుం& టంతో తమకు నీరు అందడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై సర్పంచ్, కార్యదర్శులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, “చూస్తాం, పరిష్కరిస్తాం” అని చెప్పి కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాలనీలో డ్రైనేజీ సమస్య కూడా తీవ్రమైందని తెలిపారు. డ్రైనేజీ పూడికలు తొలగించేందుకు సిబ్బంది వచ్చినా పూర్తిస్థాయిలో పని చేయకుండా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. డ్రైనేజీ మూసుకుపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని, దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మురికి నీరు నిల్వ ఉండడం, దోమల తీవ్రత పెరగడంతో ఒక కుటుంబం పూర్తిగా మృతి చెందిందని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కూడా అన్యాయం జరిగిందని స్థానికులు ఆరోపించారు. కాలనీలో సుమారు 100 నుంచి 150 కుటుంబాలు ఉండగా కేవలం రెండు ఇండ్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని మండిపడ్డారు. ఇల్లు ఉన్నవారికే మళ్లీ ఇండ్లు కేటాయించారని, ఇందులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. తమ ఇళ్ల దయనీయ పరిస్థితిని స్థానిక మీడియాకు చూపిస్తూ బాధ వ్యక్తం చేశారు. “ఓట్లు వేయించుకునే వరకు మాత్రమే నాయకులు గుర్తుపెట్టుకుంటారు... తర్వాత మమ్మల్ని గాలికి వదిలేస్తున్నారు” అంటూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. నీటి బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ప్రజల తరపున మాజీ సర్పంచ్ మంగయ్య మాట్లాడుతూ, పార్టీ ఏదైనా సరే ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఎస్టీ కాలనీలో నెలకొన్న నీటి, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజలకు అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలవాలని కోరారు. తమ కాలనీలో శాశ్వత పరిష్కారంగా వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ఘన వందనం

-మేడ్చల్ కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు..
-బండి రమేష్, మనుచౌదరి తెలంగాణ తల్లికి నివాళి..
-అమరవీరుల త్యాగాలను స్మరించిన ప్రముఖులు..
-ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు..

మేడ్చల్, జూన్ 2 ( హంస కలం )





తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఆయన, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాలు చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వయంపాలన, సమాన అభివృద్ధి లక్ష్యాలతో ఏర్పడిన రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న బండి రమేష్, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తుంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం, సామాజిక అభివృద్ధి దిశగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళుల అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. దేశభక్తి నినాదాలు, తెలంగాణ గీతాలాపనల మధ్య కార్యక్రమం ఘనంగా సాగింది. తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని పలువురు ప్రతిజ్ఞ చేశారు..

# అమరవీరుల త్యాగాలే తెలంగాణకు పునాది

-మూసాపేట్‌లో ఘన ఆవిర్భావ వేడుకలు..

మూసాపేట్, జూన్ 2 ( హంస కలం వార్త )

మూసాపేట్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వ్యవసాయం, సాగునీరు, సంక్షేమం, మౌలిక వసతులు తదితర రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు సాగిన పోరాట గాథను, అనంతరం సాధించిన అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, నపారి చంద్రశేఖర్, అశోక్, గరిగె తుకారాం, సుందర్, బాలరాజు, బాబురావు, తూము మనోజ్, ఇనుగంటి రాజు, రాంచందర్ సింగ్, శ్రీనివాస్, ఆశీర్వాదం, యాదిలాల్, లింగం, అంజయ్య యాదవ్, ఎ చెరుకు సత్యనారాయణ, ఈశ్వర్, అరుణ్, వినోద్, గరిగె కృష్ణ, వీరాచారి, నరేష్, రవీందర్, పవన్, కోటి, సంజయ్, ప్రసాద్, అక్షయ్, గిరీష్, ఉమావతి, సూర్యకళ, హరిత, రమాదేవి, సుకన్య, ఉమా, శాంత, అనురాధ,



లావణ్య, శోభ, సంధ్య, సుజాత, శివాని పాల్గొన్నారు..

## తెలంగాణ జెండా ఆవిష్కరణతో మార్మోగిన ఉద్యమ స్ఫూర్తి

-జగద్గిరిగుట్టలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు..



జగద్గిరిగుట్ట, జూన్ 2 ( హంస కలం వార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్ వద్ద తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, మాజీ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, మహాత్మా గాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. అనంతరం కొలుకుల జైహింద్, రుద్ర అశోక్ మాట్లాడుతూ, ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్ఫూర్తితో సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, వేణు యాదవ్, పాపిరెడ్డి, విట్టల్, ముదిరాజ్, నరసింహారెడ్డి, తోక యాదగిరి, సాయిలు యాదవ్, మెట్ల శీను, బండ మహేందర్, త్రివేణి, మధు, బసవేశ్వర్, ఎర్ర సైదులు, వెంకటేష్, ప్రకాష్, మల్లాచారి, బ్రహ్మాచారి, ముంతాజ్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ అభివృద్ధిలో యువతే కీలక శక్తి

-జనసేన కార్యాలయంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు..



కూకట్‌పల్లి, జూన్ 2 ( హంస కలం వార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఐదో దశలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన అనేది దశాబ్దాల పాటు సాగిన ప్రజా ఉద్యమాల ఫలితమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజా సంఘాల త్యాగాలు, నిరాహార దీక్షలు, ఆందోళనలు, పోరాటాల కారణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎన్నటికీ మరువలేమని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగాలని, యువతకు ఉపాధి, రైతులకు భరోసా, మహిళలకు రక్షణ, అన్ని వర్గాల సంక్షేమం అందేలా ప్రభుత్వాలు పనిచేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసిన నాయకులు, జనసేన పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## తెలంగాణకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్

అల్విన్ కాలనీ, జూన్ 2 ( హంస కలంవార్త



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ గద్దెల వద్ద పార్టీ జెండాను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అనిల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ, 14 ఏళ్ల పాటు సాగిన కేసీఆర్ ఉద్యమ పోరాటం దగాపడ్డ తెలంగాణ నేలకు విముక్తి కల్పించిందని అన్నారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలన తెలంగాణ గతిని మార్చి అభివృద్ధి పథంలో నడిపిందని పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ అనే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లి దేశానికే ఆదర్శంగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను ప్రతి తెలంగాణ బిడ్డకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, లక్ష్మణ్, కర్ణాటక రాజు, జీవన్, పాండు, కృష్ణ, జగదీష్, యాదాద్రి, రామస్వామి, వెంకటేష్ గౌడ్, శ్రీను, ముస్తఫా, జీవన్ రెడ్డి, వెంకట్, సైదులు, కేబుల్ సాయి, బసవ, శివ, హర్ష, ఆదర్శ్, ప్రదీప్ రెడ్డి, నవీన్ రావు, రాజు, లడ్డు, మనోజ్, పవన్, ఆనంద్, ధాత్తు గౌడ్, వికాస్ శర్మ, అనిల్ రెడ్డి మిత్ర మండలి సభ్యులు పాల్గొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు..

## అమరవీరుల ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గం



ఫతేనగర్, జూన్ 2 ( హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫతేనగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండాల సతీష్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల సేవలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పండాల సతీష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో కుటుంబాలు త్యాగాలు చేశాయని, ఆ త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు..

## అమరవీరుల త్యాగాలతోనే తెలంగాణ ఆవిర్భావం

-సమతా నగర్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు..

హైదర్‌నగర్, జూన్ 2 ( హంస కలంవార్త )



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హైదర్‌నగర్ డివిజన్ సమతా నగర్‌లోని మాజీ కార్పొరేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలు, దశాబ్దాల ఉద్యమ పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. అమరవీరుల ఆశయాలను సాకారం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని నార్నే శ్రీనివాసరావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు..

## సంగారెడ్డిలో వైభవంగా తెలంగాణ వేడుకలు

-అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం..

సంగారెడ్డి, జూన్ 2 ( హంస కలంవార్త )



తెలంగాణ రాష్ట్రం నేడు అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామిక ప్రగతి, సామాజిక న్యాయం రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్ర పురోగతిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన అధికారిక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అమరవీరుల ఆశయాల సాధనే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అంతకుముందు ఐబీ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అనుసంధాన పథకం కింద రూ.69.19 కోట్ల విలువైన రుణాల చెక్కులను అందజేశారు. దృష్టిలోపం కలిగిన నలుగురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులు అందజేశారు. వేసవి శిబిరాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పోలీసు అధికారి పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# నంబర్ వన్ లక్ష్యంగా తెలంగాణ ఆర్టీసీ

-దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్టీసీ.. ఎలక్ట్రిక్ బస్సుల్లో నంబర్ వన్..

హైదరాబాద్, జూన్ 2 ( హంస కలంవార్త )





తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు బస్ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ జెండా కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్న వై. నాగిరెడ్డి, రాష్ట్ర అభివృద్ధిలో తెలంగాణ ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఒకప్పుడు అనేక సవాళ్లు ఎదుర్కొన్న సంస్థ నేడు దేశ ప్రజారవాణా రంగంలో ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సంస్థ చరిత్రలో మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు భారీగా లబ్ధి పొందుతున్నారని, ఇప్పటికే 10 వేల కోట్ల ఉచిత ప్రయాణాలను పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించామని వెల్లడించారు. మహిళా సంఘాలకు బస్సులు కేటాయించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చారిత్రాత్మక చేయూతనందిస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టామని, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను విజయవంతంగా నడుపుతూ తెలంగాణ ఆర్టీసీ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష బస్సు ట్రాకింగ్ వంటి ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగినప్పటికీ డ్రైవర్లు, కండక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రయాణికుల భద్రతే ప్రథమ కర్తవ్యమని, ప్రతి ప్రయాణికుడిని కుటుంబ సభ్యుడిగా భావించి సేవలు అందించాలని సూచించారు. సంస్థ అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమానికి యాజమాన్యం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రభుత్వం సంపూర్ణ అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ వన్ ప్రజారవాణా సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. వెంకన్న, విజయ పుష్ప, శ్రీధర్, ఉషాదేవి, శ్రీదేవి, కవిత, ప్రభులతతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

# అమరవీరుల త్యాగాలకు ఘన నివాళులు

-తెలంగాణ ఆత్మగౌరవ పోరాట ఫలితమే రాష్ట్ర ఆవిర్భావం..

ఆల్విన్ కాలనీ, జూన్ 2 ( హంస కలంవార్త )



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆశా నగర్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద, ఇంద్రహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, ప్రజల ఆత్మగౌరవ పోరాట ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరులకు ఘన నివాళులు అర్పించిన ఆయన, రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, కాలనీ వాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. అమరవీరుల త్యాగాల ఫలమే తెలంగాణ.. వారి ఆశయాల సాధనే మనందరి బాధ్యత దొడ్ల వెంకటేష్ గౌడ్..

# తెలంగాణ కోసం త్యాగాలు మరువరాదు

కూకట్‌పల్లి, జూన్ 2 ( హంస కలంవార్త )



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కెపిహెచ్‌బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కెపిహెచ్‌బిలోని ప్రధాన రహదారిపై ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తదనంతరం మందడి శ్రీనివాసరావు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాధన వెనుక వేలాది మంది ఉద్యమకారులు, విద్యార్థులు, అమరవీరుల త్యాగాలు ఉన్నాయని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడారని, ఆ పోరాట గాథలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు సురేష్‌రెడ్డి, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు..

# కేసీఆర్ పోరాట ఫలమే తెలంగాణ

-తెలంగాణ అమరవీరుల త్యాగాలను మరవొద్దు..

కూకట్‌పల్లి, జూన్ 2 ( హంస కలం )



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం వెనుక వేలాది మంది అమరవీరుల త్యాగాలు ఉన్నాయని, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరవలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, పగుడాల బాబురావు, ప్రభాకర్ గౌడ్, కృష్ణారెడ్డి, సంతోష్, తులసిరావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# జాతీయ పతాక ఆవిష్కరణతో ఆవిర్భావ వేడుకలు

శేరిలింగంపల్లి, జూన్ 2 ( హంస కలంవార్త )



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శేరిలింగంపల్లిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక శాసనసభ్యుడు, ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కోట్లాది ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణాభివృద్ధి వంటి అంశాల్లో రాష్ట్రం వేగంగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. అమరవీరుల త్యాగాలే తెలంగాణ ప్రగతికి బాటలు వేసాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణేష్, నేత ఇబ్రహీం, మరేళ్ల శ్రీనివాస్, బోయ కిషన్ తదితర నాయకులు పాల్గొని తెలంగాణ తల్లికి నివాళులర్పించారు..

# తెలంగాణ అభివృద్ధికి పోలీసులే భద్రతా బలం

**-ప్రజల రక్షణతోనే పెట్టుబడులు, ప్రగతి..**

సైబరాబాద్, జూన్ 2 ( హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరేడ్ మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సాధన అమరవీరుల త్యాగాల ఫలితమని, రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర కీలకమని పేర్కొన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సైబరాబాద్ ముందంజలో ఉందని, సమాచార సాంకేతిక రంగం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, తయారీ రంగం, అంతర్జాతీయ విమానాశ్రయం, ఆర్థిక జిల్లా, మెట్రో రైలు, వంతెనల నిర్మాణం తెలంగాణ ప్రతిష్టను పెంచాయని వివరించారు. ప్రజల భద్రత కల్పించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించి అభివృద్ధికి అనుకూల





వాతావరణం సృష్టించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన అధికారులకు సేవా పతకాలను ప్రదానం చేశారు. మహోన్నత సేవా పతకాలకు ఎస్. రవికుమార్, జి. అశోక్ ఎంపిక కాగా, ఉత్తమ సేవా పతకాలకు కె. శ్రీనివాస్, ఎస్. రాంబాబు, మహ్మద్ హాజీ మియా, కృష్ణ నరేడ్ల, వి. వెంకట సూర్యనారాయణ రాజు ఎంపికయ్యారు. సేవా పతకాలకు మరో 37 మంది అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. హైదరాబాద్ జిల్లా మహిళా మండలుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి షహీన్ అఫ్రోజ్ ఎ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమం, అనాథాశ్రమానికి చెందిన 28 మంది చిన్నారులు వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు డాక్టర్ ఎం. రమేష్ బహుమతులు అందజేశారు. షహీన్ అఫ్రోజ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్. కోటి రెడ్డి, టి. అన్నపూర్ణ, సి.హెచ్. శ్రీనివాస్, రితిరాజ్, ముత్యం రెడ్డి, వై.వి.ఎస్. సుధీంద్ర, సృజన కరణం, టి. సాయి మనోహర్, శోభన్ కుమార్, సంజీవ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

# ప్రజా భద్రతలో విశిష్ట సేవలకు గుర్తింపు

**-తెలంగాణ పోలీస్ సేవా పతకం దక్కించుకున్న టి. నర్సింహా రాజు..**

బాలానగర్, జూన్ 2 ( హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాలానగర్ పోలీసు విభాగానికి గర్వకారణమైన ఘట్టం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, నిబద్ధత, ప్రజాసేవలో విశేష కృషి కనబరిచిన బాలానగర్ పోలీసు అధికారి టి. నర్సింహా రాజు ప్రతిష్ఠాత్మక తెలంగాణ పోలీస్ సేవా పతకానికి ఎంపికై ప్రత్యేక గుర్తింపు పొందారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ప్రభుత్వం ఈ ఏడాది సేవా పతకాలను ప్రకటించింది. మొత్తం 631 మంది పోలీసు సిబ్బందికి ఈ గౌరవం దక్కగా, అందులో బాలానగర్ పోలీసు విభాగానికి చెందిన టి. నర్సింహా రాజు ఎంపిక కావడం స్థానిక పోలీసు శాఖకు గర్వకారణంగా మారింది. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన సమర్థతకు గుర్తింపుగానే ఈ పురస్కారం లభించిందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. క్రమశిక్షణ, అంకితభావం, ప్రజలతో స్నేహపూర్వక వ్యవహారం ద్వారా టి. నర్సింహా రాజు పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా టి. నర్సింహా రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ పురస్కారం తన ఒక్కరికే కాకుండా తనతో కలిసి పనిచేసిన పోలీసు సిబ్బంది కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా సేవా పతకాలను అధికారికంగా ప్రదానం చేయనున్నారు.



ఈ సందర్భంగా బాలానగర్ పోలీసు విభాగంలోని సహచరులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు టి. నర్సింహా రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు..

# ఓటు హక్కుపై బీజేపీ దాడి

**-సర్' పేరుతో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు బీజేపీ కుట్ర**
**-బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం**
**-సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**
**-రైతు డిస్కంను ఉపసంహరించుకోవాలి**
**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

జూన్ 2 ( హంస కలంవార్త )

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు కాపాడుకోవాలని,సర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక ధ్రువీకరణ) పేరుతో మైనారిటీలు,దళితులు, ఆదివాసీల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. మంగళవారం ఖమ్మంనగరంలోని సుందరయ్య భవనం నందు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ధ్రువీకరణ పత్రాల లేమి కారణంగా పేద ప్రజలు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య విధానానికి బదులుగా ప్రభుత్వమే




ఓటర్లను ఎంపిక చేసే పరిస్థితికి దేశాన్ని నెట్టివేస్తోందన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.అనంతరం సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వ్యవసాయ రంగానికి సంబంధించి మాట్లాడుతూ రైతుల పొలాల్లో విద్యుత్ మీటర్ల ఏర్పాటు,విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం రైతు డిస్కంను తీసుకొచ్చిందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రైతు డిస్కం ద్వారా రైతులు,పేద ప్రజలకు అందుతున్న విద్యుత్ సబ్సిడీలను ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులను ముందుగానే అందుబాటులో ఉంచాలని,నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్ల సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకు రుణాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్,కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం,యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మెరుగు సత్య నారాయణ, యం.గోపాల్ రావు మరియు జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో 70 ఏళ్ల వృద్ధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**-పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు**
**-సంతోష్‌నగర్ పోలీసుల పక్కా దర్యాప్తుతో నేరం రుజువు**

జూన్ 2 ( హంస కలంవార్త )

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన 70 ఏళ్ల వృద్ధుడికి హైదరాబాద్ పోక్సో ప్రత్యేక కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. బాలికపై దారుణానికి పాల్పడిన దుకాణ యజమానిపై నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు ఈ కఠిన తీర్పును వెలువరించింది.కేసు వివరాల ప్రకారం...పాలు కొనుగోలు చేయడానికి వెళ్లిన మైనర్ బాలికపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు.బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంతోష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు సేకరించిన సాక్ష్యాధారాలు, బాధితురాలి వాంగ్మూలం, విచారణలో సమర్పించిన ఆధారాల ఆధారంగా నిందితుడి నేరం రుజువైంది.దీంతో పోక్సో ప్రత్యేక కోర్టు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.మైనర్లపై జరిగే లైంగిక నేరాల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని,పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.పోక్సో కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు విధించడం ద్వారా బాలల



రక్షణకు న్యాయవ్యవస్థ కట్టుబడి ఉందని న్యాయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

## అమరవీరుల త్యాగాలకు ఘన నివాళులు



కూకట్‌పల్లి, జూన్ 2 ( హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాఘవేంద్ర నగర్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు ఎం. కుమారాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం దేశభక్తి నినాదాలతో మారుమోగింది. ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్ రావు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కొరదాల నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురభి రవీందర్ రావు, డాక్టర్ కొరదాల నరేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో భారతీయ జనతా పార్టీ పోషించిన పాత్రను వివరించారు. పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటుకు మద్దతుగా సుష్మా స్వరాజ్ చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని గుర్తు చేశారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ వారి త్యాగాలను సమాజం ఎన్నటికీ మరవవదని పేర్కొన్నారు. వేడుకల్లో లంగటి నరేందర్ రెడ్డి, చెన్ననేని స్రవంతి, కేశవ్ రావు, రాజు, హరీష్ రెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కాలనీవాసులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక"పర్యావరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



జూన్ 2 ( హంస కలంవార్త )

"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, వర్షాకాలం సన్నద్ధత, గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై హైదరాబాదు నుంచి సిఎస్ రామకృష్ణ రావు, రాష్ట్ర డిజిపి సి.వి ఆనంద్,ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్యక్రమాలను ముందస్తు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈనెల 4,6,8,10 వ తేదీలలో గ్రామ, వార్డు సభలను ఏర్పాటు చేసి వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సభలలో ముఖ్యంగా రైతులకు రానున్న వర్షాకాలం,వాతావరణ పరిస్థితులు, పంటల సాగు వంటి అనేక విషయాలను వివరించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.గ్రామ సభలలో మండల స్థాయి అధికారులు మొదలుకొని ప్రజా ప్రతినిధులు, ప్రజలు,మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం, ఆకస్మిక వరదలు, విపత్కర పరిస్థితులపై అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పోలీసులు, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పర్యావరణ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు.రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు.సిఎస్ ఆదేశాల ప్రకారం ఈనెల 4,6,8, 10 తేదీలలో గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై రైతాంగానికి, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో పాటుగానే ఎస్‌ఐఆర్ ప్రక్రియపై కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో గ్రామ సభలను అత్యంత విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పెండింగ్ లో ఉన్న భూభారతి,సాదా బైనామా దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ వీసీ, సమావేశంలో ఐటిడిఏ పిఓ మంద మకరందు, అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, ఎస్.రాజేశ్వర్, డిఆర్డిఓ రవీందర్, జడ్పీ సీఈఓ రవి, డిపివో రమేష్, సిపివో, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# ఐపీఎల్‌లో అత్యంత అరుదైన ఘనత అందుకున్న ఆర్సీబీ ప్లేయర్లు



స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకోవడంతో ఆ జట్టు సభ్యులతో పాటు అభిమానులు ఆనందంలో మునిగితేలుతున్నారు. ఆర్సీబీ జట్టు విజయం సాధించడంతో పాటు ఐపీఎల్ చరిత్రలో అత్యంత అరుదైన ఘనతను ఆ జట్టులోని ఇద్దరు సభ్యులు సాధించారు. అది కూడా ఐపీఎల్ చరిత్రలో ఒకే ఒక్కరికి దక్కిన రికార్డును ఈ ప్లేయర్లు సాధించారు. మరి.. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా నిలవడంతో ఆ జట్టులోని ఆటగాళ్లు ఫిల్ సాల్ట్, సుయాశ్ శర్మ హ్యాట్రిక్ ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన అరుదైన ఫీట్‌ను నమోదు చేశారు. టైటిళ్లు గెలిచిన సీజన్‌లలో ఆయా జట్లలో కనీసం ఒక మ్యాచ్ అయినా ఆడిన ఆటగాళ్లుగా వీరు ఉన్నారు. గతంలో కర్ణ్ శర్మ ఒక్కడే ఈ ఘనతను సాధించగా.. తాజాగా సాల్ట్, సుయాశ్ ఈ జాబితాలో చేరారు. కర్ణ్ శర్మ 2016లో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో, 2017లో ముంబై ఇండియన్స్‌తో, 2018లో చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో సభ్యుడిగా ఉండి ఐపీఎల్ టైటిళ్లు సాధించాడు. అలానే సాల్ట్, సుయాశ్ ఇద్దరూ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో, 2025, 2026లో ఆర్సీబీతో ఐపీఎల్ టైటిళ్లు సాధించి... ఈ చారిత్రక రికార్డును సొంతం చేసుకున్నారు. ఐపీఎల్ 2026 వేలంలో 11.50 కోట్లకు సాల్ట్‌ను ఆర్సీబీ కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో ఆరు మ్యాచులు ఆడిన సాల్ట్ 168.33 స్ట్రైక్ రేట్‌తో 202 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఐపీఎల్ లో 40 మ్యాచులు ఆడిన సాల్ట్ 12 హాఫ్ సెంచరీలతో సహా 1258 పరుగులు సాధించాడు. ఇక సుయాశ్ విషయానికి వస్తే.. అతడిని ఐపీఎల్ 2026 వేలంలో ఆర్సీబీ రూ.2.60 కోట్లకు దక్కించుకుంది. ఈ యువ లెగ్ స్పిన్నర్ ఐపీఎల్-19లో 12 మ్యాచులు ఆడి 9.21 ఎకానమీ రేటుతో 9 వికెట్లు సాధించాడు. మొత్తంగా 39 ఐపీఎల్ మ్యాచుల్లో 44.07 సగటుతో 27 వికెట్లు పడగొట్టాడు.



## యూకే మార్కెట్‌పై పట్టు బిగిస్తున్న భారత కంపెనీలు

ఇంటర్నెట్ డెస్క్:



యూకే మార్కెట్‌లో భారత కంపెనీల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గతేడాదితో పోలిస్తే కంపెనీల సంఖ్య 60 శాతం మేర పెరిగింది. గ్రాంట్ థ్రాంటన్ యూకే సంస్థ ప్రచురించిన ఇండియా మీట్స్ బ్రిటన్ ట్రాకర్ నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, ప్రస్తుతం యూకేలో భారతీయులు నిర్వహిస్తున్న కంపెనీల సంఖ్య 1,912కు పెరిగింది. ఏడాది క్రితం ఈ సంఖ్య 1,197గా ఉండేది. ఈ కంపెనీల మొత్తం టర్నోవర్ విలువ కూడా 72.14 బిలియన్ పౌండ్ల నుంచి 105.77 బిలియన్ పౌండ్లకు పెరిగింది. 2025లో భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక వాణిజ్య 47.4 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 11 శాతం అధికం.గతేడాది ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. త్వరలో ఇది చట్టరూపం దాల్చనుంది. ఈ ఒప్పందం కారణంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకున్నాయని నివేదిక తెల్చింది. 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లు చేర్చేలా ఈ ఒప్పందం కుదిరింది. ఈ నివేదిక ప్రకారం, బ్రిటన్‌లో భారతీయులకు చెందిన 66 కంపెనీల వార్షిక ఆదాయం 10 శాతం మేర పెరిగింది. యూకేలో ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ భారతీయ కంపెనీలు మంచి వృద్ధిని సాధిస్తున్నాయి. వృద్ధి పథంలో దూసుకుపోతున్న కంపెనీల్లో ప్రైమ్ ఫోకస్ ఇంటర్నేషనల్ సర్వీసు, జైడస్ ఫార్మాసిటుకల్స్ యూకే సంస్థలు ముందు వరుసలో నిలిచాయి.

# వెస్టిండీస్ జట్టుకు ఊహించని షాకిచ్చిన ఐర్లాండ్

స్పోర్ట్స్ డెస్క్
వెస్టిండీస్ మహిళల జట్టుకు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. ట్రై సిరీస్‌లో భాగంగా డబ్లిన్ వేదికగా జరిగిన విండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ విజయం సాధించింది. మహిళల టీ20ల్లో వెస్టిండీస్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో ఐర్లాండ్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఐర్లాండ్ కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ అదరగొట్టి తన జట్టు గెలుపులో కీలక పాత్రపోషించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్(1), టేలర్(9),డాటిన్(16) వంటి సీనియర్ ప్లేయర్లు విఫలమయ్యారు. 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న విండీస్ జట్టును షెమైన కాంప్‌బెల్ ఆదుకుంది. ఆఖరిలో గ్లాస్గో(36) కాస్త దూకుడుగా ఆడడంతో విండీస్‌కు కాస్త గౌరవప్రదమైన స్కోర్ దక్కింది. అనంతరం 142 పరుగుల టార్గెట్ తో ఐర్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది.




ఐర్లాండ్ స్కోర్ 14.1 ఓవర్లలో 95/5 వద్ద ఉండగా ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. అయితే ఆ సమయానికి డక్ వర్త్ లూయిస్ ప్రకారం ఐర్లాండ్ 3 పరుగులు వెనుకబడి ఉంది. అంపైర్లు మ్యాచ్‌ను ఆపేసే ముందు కనీసం ఒక్క బంతి అయినా వేయాలని ఐర్లాండ్ బ్యాటర్లు పట్టుబట్టారు. జాజారా క్లాక్సన్ వేసిన బంతి లూయిస్ లిటిల్ ఫోర్ కొట్టాడు. వర్షం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. అప్పటికి డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఐర్లాండ్ 1 పరుగు ఆధిక్యంలో ఉండటంతో ఐర్లాండ్ జట్టును విజేతగా ప్రకటించారు. ఓర్లా ప్రెండర్‌గాస్ట్(46 బంతుల్లో 71 పరుగులు) అజేయంగా నిలిచింది. ఈ ట్రై సిరీస్ లో పాకిస్థాన్, ఐర్లాండ్, వెస్టిండీస్ మహిళల జట్టు పాల్గొన్నాయి. ఇప్పటికీ రెండు మ్యాచులు ఓడి.. పాయింట్ల పట్టికలో పాకిస్థాన్ చివరి స్థానంలో ఉంది. ఐర్లాండ్, విండీస్ జట్లకు సమానంగా నాలుగు పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్ రేట్ ప్రకారం వెస్టిండీస్ టాప్ ప్లేసులో ఉంది. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఈ మూడు జట్టులో మిగిలిన జట్లతో రెండేసి మ్యాచులు ఆడాల్సి ఉంటుంది.

## టాటా సన్స్ లిస్టింగ్‌పై సస్పెన్స్

వ్యతిరేకిస్తున్న నోయెల్ టాటా.. ఆర్‌బీఐకి లేఖ
లిస్టయితే కంపెనీ దాతృత్వ లక్ష్యాలకు
విఘాతం అంటున్న టాటా ట్రస్టుల చైర్మన్




న్యూఢిల్లీ
టాటా గ్రూపు హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ షేర్ల లిస్టింగ్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్ఛేంజ్‌లో నమోదు చేయాలని ఒత్తిడి చేయవద్దంటూ టాటా సన్స్‌లో అతిపెద్ద వాటాదారైన టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా ఆర్‌బీఐకి లేఖ రాసినట్టు సమాచారం. లిస్టు చేయాలని ఒత్తిడి చేస్తే తమ దీర్ఘకాలిక లక్ష్యాలైన ధార్మిక, దాతృత్వ లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన తన లేఖలో ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో టాటా సన్స్ లిస్టింగ్‌పై టాటా ట్రస్ట్‌లో కొనసాగుతున్న విభేధాలు మరోసారి తెరపైకి వచ్చాయి. టాటా సన్స్ వాస్తవ విలువ కనుగొనడం, నిర్వహణలో పారదర్శకత, షాపూర్జీ పల్లోంజి వంటి మైనారిటీ వాటాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం లిస్టింగ్ చేయడం మంచిదని వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వంటి టాటా ట్రస్ట్స్ సభ్యులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు లిస్టింగ్ కోసం తమను ఒత్తిడి చేయవద్దని టాటా ట్రస్ట్స్ చైర్మన్ హోదాలో నోయెల్ టాటా కోరడం విశేషం. ఇతర కష్టాలు: టాటా సన్స్ షేర్లను లిస్టు చేయడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులనూ నోయెల్ టాటా తన లేఖలో ఆర్‌బీఐకి వివరించినట్టు తెలుస్తోంది. షేర్లను లిస్టు చేయడం వలన పబ్లిక్ షేర్‌హోల్డర్లు ఎంత సేపటికీ స్వల్పకాలిక ప్రయోజనాల కోసం చూస్తారే తప్ప, దీర్ఘకాలిక ప్రయోజనాలు చూడరని టాటా వివరించారు. అలాంటప్పుడు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎయిరిండియా వంటి నష్టాల్లో ఉన్న కంపెనీలను కొనుగోలు చేయడమూ కష్టమవుతుందని ఆర్‌బీఐకి వివరించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే లిస్టింగ్ తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి కంపెనీ ఆర్థిక ఫలితాలు పబ్లిక్ షేర్ హోల్డర్లకు వివరించడమూ పెద్ద తలనొప్పి అని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు.

**-చంద్రకు మూడో టర్మ్ డౌటేనా!**

మరోవైపు ఎన్ చంద్రశేఖరన్‌ను వరుసగా మూడోసారి టాటా సన్స్ చైర్మన్‌గా పునర్నియామకంపైనా సస్పెన్స్ కొనసాగుతోంది. గత నెల 26న జరిగిన టాటా సన్స్ బోర్డు భేటీలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. అయితే కొన్ని ఇతర ముఖ్యమైన విషయాలు చర్చించాల్సి ఉన్నందున ఈ విషయాన్ని పక్కన పెడదామని టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా చెప్పడంతో, చంద్రశేఖరన్ పునర్నియామకం చర్చకే రాలేదు. దీంతో చంద్రశేఖరన్ టాటా గ్రూపులో కొనసాగుతారా? లేదా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# మరో 9 రోజుల్లో... వచ్చేస్తోంది సాకర్ సమరం

ఖండాలన్నీ కదంతొక్కే సమరం.. ఊహకందని విన్యాసాలు.. లిప్తపాటులో తలకిందులయ్యే ఫలితాలు.. అవధుల్లేని ఆనందాలు.. అంతులేని నిర్వేదాలు.. ఇలా భూగోళం మొత్తాన్ని 'బంతి'లా ఆడేసే.. టోర్నీలకెల్లా బంపర్ టోర్నీ.. సాకర్ సమరానికి వేళైంది. యావ త్ ప్రపంచానికి ఫుట్‌బాల్ ఫీవర్ ఎక్కించే మాస్ మహా జాతర 'ఫిఫా వరల్డ్‌కప్'నకు మరో 9 రోజుల్లో తెరలేవనుంది. 39 రోజులపాటు.. సాకర్ కిక్కుతో.. చిందులు తొక్కించనుంది.నాలుగేళ్లకొకసారి ప్రపంచం మొత్తాన్నీ ఉర్రూతలూగించే సాకర్ సంరంభానికి ఈసారి అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. 23వ ఫిఫా వరల్డ్‌కప ఈ నెల 11న ఆరంభం కానుండగా.. వచ్చే నెల 19న న్యూయార్క్‌లో జరిగే మెగా ఫైనల్‌తో ముగియనుంది. డిఫెండింగ్ చాంప్‌గా అర్జెంటీనా బరిలోకి దిగనుంది.

**-జంబో టోర్నీ**

ఇప్పటి వరకు జరిగిన ఈవెంట్లు ఒక లెక్క కాగా.. ఇప్పుడు జరగబోయేది అంతకు మించి అన్నట్టుగా సాగనుంది. 39 రోజులపాటు టోర్నీ సాగనుండగా.. 104 మ్యాచ్‌లకు 16 నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. బరిలోకి దిగే జట్ల సంఖ్యను 32 నుంచి 48కి పెంచారు. ఆయా జట్లను నాలుగేసి చొప్పున 12 గ్రూప్‌లుగా వర్గీకరించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లతోపాటు మూడో స్థానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన మరో 8 జట్లను నాకౌట్ రౌండ్-32కు ఎంపిక చేయనున్నారు. మొత్తంగా కలల కప్‌ను సొంతం చేసుకోవాలంటే ఆయా జట్లు 8 మ్యాచ్‌లు నెగ్గాల్సి ఉంటుంది.




**-ఐరోపాలోనే ఎక్కువగా..**

ఇప్పటి వరకు జరిగిన 22 ప్రపంచ కప్‌ల్లో.. 11సార్లు ఐరోపా దేశాలు ఆతిథ్యం ఇచ్చాయి. ఆసియాలో తొలిసారి 2002లో జపాన్, కొరియాలు సంయుక్తంగా నిర్వహించాయి. 2010లో ఆఫ్రికా ఖండానికి మొదటిసారి వరల్డ్‌కప్ నిర్వహణ హక్కులు దక్కాయి. 2022 వరల్డ్‌కపనకు పశ్చిమాసియా దేశమైన ఖతార్ వేదికైంది.


# ‘పెద్ది’ ఇండస్ట్రీకి పెద్ద దిక్కు అవుతుంది



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జగపతి బాబు ఆసక్తికర వ్యాఖ్యలు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతున్న ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఈవెంట్ విజయవాడలో అభిమానుల సందడి మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులతో పాటు భారీ సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతున్న ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఈవెంట్ విజయవాడలో అభిమానుల సందడి మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులతో పాటు భారీ సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతి బాబు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ‘పెద్ది’ చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న ఆయన, సినిమా విజయంపై పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కేవలం ఒక సినిమా విజయంగా కాకుండా, మొత్తం తెలుగు సినీ పరిశ్రమకు ఈ చిత్రం కొత్త ఊపిరి పోస్తుందని అన్నారు. పెద్ది సినిమా ఇండస్ట్రీకి, డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు ఒక పెద్ద దిక్కు అవుతుంది అంటూ జగపతి బాబు వ్యాఖ్యానించారు. ఇటీవల సంక్రాంతి సీజన్ తర్వాత ఆశించిన స్థాయిలో కమర్షియల్ విజయాలు లేకపోవడంతో థియేటర్ రంగం కొంత ఒత్తిడిని ఎదుర్కొంటోందని, అలాంటి సమయంలో ‘పెద్ది’లాంటి భారీ చిత్రం బాక్సాఫీస్‌కు కొత్త జోష్ తీసుకురావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయని, ప్రేక్షకులు ఒక మంచి థియేట్రికల్ అనుభవం కోసం ఎదురుచూస్తున్నారని జగపతి బాబు తెలిపారు. బుచ్చిబాబు ఈ చిత్రాన్ని ఎంతో ఎమోషన్, ఇంటెన్సిటీతో తెరకెక్కించారని, రామ్ చరణ్ కెరీర్‌లో ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ‘పెద్ది’లో రామ్ చరణ్ సరికొత్త మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, బలమైన భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ఇప్పటికే ధీమా వ్యక్తం చేస్తోంది. ఇటీవల విడుదలైన ట్రైలర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు లభించిన స్పందన సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జగపతి బాబు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ‘రాజు వెడ్స్ రాంబాయి’ మేకర్స్ కొత్త మూవీ

– తెలంగాణ యాసొచ్చినోళ్లకు బంపర్ ఆఫర్!



ఇటీవల ‘రాజు వెడ్స్ రాంబాయి’ సినిమాతో ప్రేక్షకులను అలరించిన నిర్మాణ సంస్థ ఇప్పుడు మరో అర్థవంతమైన, గట్టి సందేశాత్మక చిత్రంతో రాబోతోంది. విలక్షణ దర్శకుడు వేణు వుడుగుల, సంధ్యా భాను చల్లా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మధుకర్ రెడ్డి కొమిరెడ్డి కథ, దర్శకత్వం వహిస్తున్నారు. ఒక యదార్థ గాథ ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. భారతీయ కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య గొడవలు, విభేదాలు కొత్తవి కావు గానీ, ఒక ఇల్లు చీలిపోతే కేవలం ఆ కుటుంబమే ఓడిపోతుందా? లేక ఆ ఊరంతా నష్టపోతుందా? అనే ఒక గంభీరమైన ప్రశ్న చుట్టూ ఈ కథ తిరుగుతుంది. “అన్నదమ్ములు అంటే రామలక్ష్మణుల్లా ఉండేవారనే రోజులు పోయాయిడ ఇప్పుడు రక్తం పంచుకున్నవాళ్లే గొడ్డళ్లు పట్టుకునే మహాభారతం నడుస్తోంది. మా ఊరు జమ్మికుంట మట్టిసాక్షిగా.. ఇద్దరు అన్నదమ్ముల పంచాయితీ, కేవలం వాళ్ల ఇల్లనే కాదు మా ఊరి రాతనే మార్చేసింది. అసలు ఆ రోజు ఎవరు గెలిచారో తెలియదు కానీడ ఊరు మాత్రం ఓడిపోయింది. ఇది ఏ ఇంట్లోనూ జరగకూడని కథ. పిల్లలు, పెద్దలు, తాతలు, అమ్మలు, అక్కలు, చెల్లెళ్లుడ అందరూ బయల్దేరండి, ఆ అన్నదమ్ముల పంచాయితీ ఏంటో సూద్దాం.” అని మేకర్స్ ఒక ఎమోషనల్ నోట్ వదిలారు. మధుకర్ రెడ్డి కొమిరెడ్డి కథ–దర్శకత్వంలో, ప్రొడక్షన్ నంబర్ 2గా వస్తున్న ఈ సినిమాలో నటించడానికి చిత్రబృందం నటీనటుల వేట మొదలుపెట్టింది. తెలంగాణ యాస, భాష ముచ్చటగా మాట్లాడటం అచ్చినోళ్లు, నటనపై ఆసక్తి ఉన్న అన్ని వయసుల వారు తమ ఆడిషన్ వీడియోలను పంపించవచ్చని చిత్రబృందం తెలిపింది. ఆసక్తి గలవారు ఎంట.జూతీశీఎబష్టఅశీఅ02ఏస్త్రఋఱశ్రీ.ఎశీఎ ఇమెయిల్‌కు గానీ, లేదా దర్శకుడు వేణు వుడుగుల వాట్సాప్ నెంబర్ 8096411437కు గానీ తమ వివరాలు పంపాల్సి ఉంటుంది. అయితే ఇన్స్టాగ్రామ్ రీల్స్ పంపేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ తీసుకోరని, కేవలం ప్రాపర్ ఆడిషన్ వీడియోలను మాత్రమే పంపించాలని మేకర్స్ స్పష్టం చేశారు.

## అబద్ధపు ప్రచారాలు చేయలేను

– ‘ఫేక్ కలెక్షన్స్’ పోస్టర్లపై యాక్షన్ కింగ్ అర్జున్ సంచలన వ్యాఖ్యలు



తన స్వీయ దర్శకత్వంలో, స్వంత నిర్మాణ సంస్థ శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా నిర్మించిన తాజా చిత్రం ‘సీతా పయనం’. ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఇటీవల థియేటర్లలో విడుదలై మోస్తారు కలెక్షన్లను రాబట్టింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా కలెక్షన్లకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని అర్జున్ సర్జా తాజాగా పంచుకున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ బాధ్యతను చూసుకునే ఒక మార్కెటింగ్ ఏజెన్సీ, కేవలం 4 రోజుల్లోనే ఈ చిత్రం రూ. 4 కోట్లు వసూలు చేసినట్లు ఒక పోస్టర్‌ను విడుదల చేద్దామని అర్జున్‌కు ప్రతిపాదించింది. తన స్వీయ దర్శకత్వంలో, స్వంత నిర్మాణ సంస్థ శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా నిర్మించిన తాజా చిత్రం ‘సీతా పయనం‘. దీనిపై స్పందించిన అర్జున్ ఆ మార్కెటింగ్ ఏజెన్సీ ప్రతిపాదనను తీవ్రంగా తిరస్కరిస్తూ, తనకు అంత డబ్బు అసలు రాలేదని, అలాంటప్పుడు అబద్ధపు వసూళ్లతో కూడిన ఫేక్ పోస్టర్లను ఎలా వేస్తామని వారిపై మండిపడినట్లు మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం సినిమాల్లో కలెక్షన్ల కోసమని ఫేక్ నంబర్లతో పోస్టర్లు వేయడం సర్వసాధారణంగా మారిన తరుణంలో, అర్జున్ నిజాయితీగా ఉంటూ అటువంటి తప్పుడు ప్రచారాలను తిరస్కరించడం విశేషమని నెటిజన్లు అతడిని ప్రశంసిస్తున్నారు.

## థియేటర్ల సమస్యకు దాసరి ఎప్పుడో దారి చూపారు



దిగ్గజ దర్శకుడు, దర్శక రత్న దాసరి నారాయణరావు వర్ధంతి సందర్భంగా దాసరి ఘాట్‌ను హీరో మనోజ్ మంచు, తన సతీమణి భూమా మౌనికతో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో దాసరి ఘాట్ దుస్థితిపై యాంకర్ గౌతమి షేర్ చేసిన వీడియోపై మనోజ్ రియాక్ట్ కావటమే కాకుండా స్వయంగా ఆ ప్రదేశాన్ని సందర్శించి, శుభ్రపరిచే కార్యక్రమాలను ప్రారంభించారు. దాసరి పట్ల తనకున్న గౌరవాన్ని, ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ మంచు మాట్లాడుతూ,’గురువు దాసరి గురించి చెప్పాలంటే గొప్ప డైరెక్టర్..గొప్ప యాక్టర్.. గొప్ప స్క్రీన్ ప్లే రైటర్.. డైలాగ్స్, ఎడిటింగ్.. ఇలా 24 శాఖలపై ఆయన రాణించారు. దాసరి ఓ ఇన్‌స్టిట్యూట్. ఆయన మనకు ఓ దారి చూపించారు. దాసరి పని అయిపోయిందని అనుకునే సమయంలో ఓ కొత్త రకమైన సినిమాతో మన ముందుకు వచ్చేవారు. ఈరోజు మనం థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం.ఇబ్బంది పడుతున్నాం. ఆయన ఎప్పుడో దీనికి సంబంధించి మార్గం చూపించారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని చెప్పారు. నాతో పాటు నాతోటి హీరోలందరూ సినిమాలు చేయటానికి ఎంతో కష్టపడుతున్నారు. అందరం వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలి. ఆ బాధ్యత అందరిపై ఉంది– అని తెలిపారు.

## ‘పోలీస్ కంప్లైంట్- రిలీజ్ డేట్ ఫిక్స్



ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మాణంలో, సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన హర్రర్ –యాక్షన్ థ్రిల్లర్ ‘పోలీస్ కంప్లైంట్’. ఈ మూవీ ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌తో పాటు రెండు ప్రత్యేక గీతాలను విడుదల చేశారు. అలాగే సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ నటించిన పలు చిత్రాల టైటిళ్లను గుర్తు చేస్తూ రూపొందించిన ఈ సినిమాలోని ప్రత్యేక గీతాన్ని కృష్ణ అభిమానుల చేతుల మీదుగా విడుదల చేశారు. కృష్ణసాయి, ప్రీతి సుందర్ ఈ గీతంలో కనిపించగా, రచన–సంగీతాన్ని దర్శకుడు సంజీవ్ మేగోటి అందించారు. మరో గీతాన్ని తెలంగాణ డీఐజీ రమణారెడ్డి విడుదల చేశారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, ‘ఈ సినిమా ఇండస్ట్రీలో పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది అని తెలిపారు. “చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ’ అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ కథ తిరుగుతుంది– అని దర్శకుడు సంజీవ్ మేగోటి చెప్పారు.బాబు, సకినాన భూలక్ష్మి తెలిపారు. సినిమా విడుదలైన అన్ని ప్రాంతాల్లో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, అనేక కేంద్రాల్లో హౌస్‌ఫుల్ షోలతో ప్రదర్శితమవు తోందని వెల్లడించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్‌తో రోజు రోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోందని, మరిన్ని కేంద్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా డా. రాజేంద్ర ప్రసాద్ చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ చిత్రానికి ప్రేక్షకులు ఇంత గొప్ప ఆదరణ అందించడం చాలా ఆనందంగా ఉందని, మంచి కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తుండటం సంతోషకరమని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు సినిమాను ఆదరించడం తనకు మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. దర్శకుడు చిరంజీవి తన్నీరు, నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మికి ఆయన అభినందనలు తెలిపారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449